# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-06-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కొనసాగుతోన్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం.**

2. **రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేసిన మంత్రి నిమ్మల రామానాయుడు.**

3. **అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని రసాయన కర్మాగారంలో అగ్ని ప్రమాదంలో ఇద్దరు మృతి చెందడంపై విచారం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి.**

4. **రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పారిశ్రామిక రంగం కీలక చోదకశక్తిగా నిలుస్తోందని పేర్కొన్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కొనసాగుతోంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తో పాటు రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి-ఎస్ఐపిబి ఆమోదించిన పెట్టుబడి ప్రతిపాదనలను మంత్రివర్గం చర్చించి ఆమోదం తెలపనుంది. అదేవిధంగా పరిశ్రమలు, సమాచార సాంకేతిక రంగం, పర్యాటకం, రాజధాని అమరావతి అభివృద్ధి తదితర అంశాలపై సమావేశంలో చర్చించి మంత్రి వర్గం ఆమోదం తెలిపే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టు వంటి కీలక అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ రాష్ట్ర పురోగతికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బీసీ సహా అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని రసాయన కర్మాగారంలో ఈరోజు జరిగిన అగ్ని ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందగా, మరికొందరు గాయపడినట్లు అధికారులు తెలిపారు. మృతులు అచ్యుతాపురం ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేసిన ఆయన, జిల్లా అధికారులతో మాట్లాడి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

అనకాపల్లి జిల్లా అగ్నిప్రమాద ఘటనపై ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, హోంమంత్రి వంగలపూడి అనిత, కార్మిక శాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్ స్పందించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి సహాయక చర్యల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని, క్షతగాత్రులకు ఉత్తమ వైద్యసేవలు అందించాలని అధికారులను వారు ఆదేశించారు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి స్పందిస్తూ, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలిచి తగిన సహాయం అందించాలని కోరారు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా భారీ వాహనాల డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హామీ ఇచ్చారు. వివిధ జిల్లాలకు చెందిన హెవీ డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల యజమానులు గుంటూరు జిల్లా తాడేపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయనను ఈరోజు కలిసి వారి సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. పరివాహన్ పోర్టల్‌లో హెవీ డ్రైవింగ్ శిక్షణ ప్రక్రియ నిలిచిపోవడంతో శిక్షణార్థులు లైసెన్సులు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రతినిధులు మంత్రికి వివరించారు. వారి వినతిని పరిశీలించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఈ అంశాన్ని రవాణా శాఖ ఉన్నతాధికారులతో చర్చించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

---------------------------

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పారిశ్రామిక రంగం కీలక చోదకశక్తిగా నిలుస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో నిర్వహించిన "ప్రకాశం బిజినెస్ ఎలైట్" సమావేశంలో ఆయన నిన్న పాల్గొని మాట్లాడారు. యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'వేగవంతమైన వాణిజ్య' విధానాన్ని అమలు చేస్తూ పరిశ్రమలకు సత్వర అనుమతులు, ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తోందని పేర్కొన్నారు. జిల్లాలో వ్యవసాయం, ఖనిజాలు, పారిశ్రామిక రంగాల్లో ఉన్న అపార అవకాశాలను సద్వినియోగం చేసేలా చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

మత్తు పదార్థాల వినియోగాన్ని నియంత్రించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని పార్వతీపురం

మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి  కోరారు. "నషా ముక్త్ భారత్" వారోత్సవాల్లో  భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, ఆర్థిక దుష్పరిణామాలను గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై జిల్లా పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద చర్యలపై 1972 టోల్ ఫ్రీ నంబర్ కు  సమాచారం అందించాలని ఎస్.వి. మాధవ్ రరెడ్డి  కోరారు.

---------------------------

అంతర్జాతీయ ఒలింపిక్ క్రీడల దినోత్సవం ఈ రోజు నిర్వహిస్తున్నారు. ప్రాచీన గ్రీస్ దేశంలో పుట్టిన ఒలింపిక్ క్రీడలు కొంత కాలం పాటు ఆగిపోయాయి. ఫ్రెంచ్ విద్యావేత్త పియరీ డి క్యూబెర్టిన్ కృషి ఫలితంగా 1894 వ సంవత్సరం జూన్ 23వ తేదీన ప్యారిస్‌లోని సోర్బెన్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ– ఐఓసి ఏర్పాటయింది. అప్పటి నుండి ప్రతి ఏటా ఇదే రోజున ఒలింపిక్ దినోత్సవం జరుగుతోంది. ఈ కమిటీ ఏర్పాటుతో ఆధునిక ఒలింపిక్ క్రీడలకు నూతన అధ్యాయం మొదలైంది. క్రీడల ద్వారా శాంతి, స్నేహం, ఐక్యతను చాటడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం  ఒలింపిక్ క్రీడల దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యం.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 135వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, లేదా మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 26వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

ఓటర్ల జాబితా సవరణ – ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు సూచించారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో  ఓటర్లను కలుసుకుని, ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ, సర్వే ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఓటరు తమ ఓటు హక్కును భద్రపరుచుకునేందుకు అవసరమైన గణన పత్రాలు, ధృవీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు ముందుగానే సిద్ధం చేసుకోవాలని  సూచించారు. బూత్ స్థాయి అధికారి –బిఎల్ఓ ఇంటికి వచ్చినప్పుడు ఫారాన్ని పూర్తిగా భర్తీ చేసి సంబంధిత పత్రాలను అందజేయాలని స్పష్టం చేశారు.

---------------------------

టిడ్కో గృహాల నిర్మాణ పనులను వేగవంతం చేసి, ఆగష్టు 15వ తేదీ నాటికి తొలి విడత గృహాలను లబ్ధిదారులకు అందించాలని జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ అధికారులను ఆదేశించారు.

====================